మా చోడవరం ఊరి పెరట్లో చాలా చెట్లు ఉన్నాయి. అవి కథల కాయలు
ములాగా కాస్తాయి. వాటిల్నే కోసి రాస్తుంటా. వైద్యానికీ, అక్షర సేద్యానికీ
కూడా పెరటి చెట్టు సాయపడుతుందనేది నా నమ్మిక. మరంచేతే
మా వాసల్లో, మా యాసల్లో కనపడ్డ చిత్రాలకి కొద్దిపాటి కల్పన అద్దగా
ఈ కుర్రుపోట్ల పుణ్యతిథి కళ్లకు కట్టింది, కథగా రూపుకట్టింది.

చింతకింది శ్రీనివాసరావు

# 12 కుర్రుపోట్ల పుణ్యతిథి

నర్సిం





“బ్రేమ్మలందరూ వొడుగులు, పెళ్లిళ్లు, గర్భాదానాలే చేయిస్తామంటే మనిషి చచ్చేక తంతు నడిపేదెవడు, తద్దినం పెట్టించేదెవడు?” అరగంట బట్టీ జరుగుబిల్లి విశ్వేశ్వరరావు ఈ మాటల్నే పదేపదే అంటూ తెగ గింజు కుంటున్నాడు.

“మన బ్రేమ్మణ్యమే అంత. ఒక పూటకి తిండి ఉంటే చాలు. ప్రెతీవాడూ బుగతలాగానే మాటాడతాడు. మొఖాసాదారుల్లాగానే మూలుగుతాడు. అవసరం ఉందని వెళితే ఇకనంతే. నానా సంకా నాకిస్తారు దరిద్రులు,” ఒకటే రెచ్చిపోతున్నాడు.

“పోనిస్తురూ. ఎందుకలా రుంజుకోడం. వస్తార్లెండి. చావు కార్యాలు చేయించేవారిని మనమే తక్కువగా చూస్తామాయె. మరంచేత ఉన్నవాళ్లే తక్కువ. వాళ్లతోనే అయిందనిపించాలి,” కామాక్షమ్మ సర్దిచెప్ప బోయింది.

“నవ్వు నోరుముయ్యవే పాజీ. నీ బాబు తద్దినవయితే నీకు తెలి సొచ్చును. నా తండ్రి తిథి కదూ. నీకేం బాధ. ఎద్దుపుండు కాక్కి నొప్పా,” దారుణంగా నీలిగేడు మొగుడు.

“మధ్యలో బతికున్న మా నాన్నకి తద్దినం మీరెందుకు పెట్టీడం. ఆయనకి నలుగురు కొడుకులున్నారులెండి పెట్టడానికి,” భర్తగారికి అవరం వివరం లేదని మనసులోనే అనుకుంటూ వసారాలోంచి వంటిం ట్లోకి విసవిసా చేరిపోయింది కామాక్షి.

ఇంతలోనే జాపోసుకుంటూ హడావిడిగా వచ్చేడు పధ్నాలుగేళ్ల నారాయణ. వస్తూనే మిద్దె ఇంటి పక్కనున్న సన్నటి పెరటి సందులోంచి జాయిగా సైకిల్ తీసుకొచ్చి వెనగ్గా ఉన్న ఆవులశాల పక్కగా నిలబెట్టేడు. నూతిలో చేదవేసి నీళ్లు లాగి మొహం కడుక్కుంటున్నాడు.

“కడిగింది చాల్లే. పేట పంతుళ్ల సంగతి చెప్పు ముందు. వస్తా నన్నారా, రానన్నారా,” నూతిపళ్లెంమీదికి వచ్చి మరీ విసురుగా అడిగేడు నారాయణని విశ్వేశ్వరరావు.

“మావయ్యా! ఇరవై కిలోమీటర్లు రానూ పోనూ సైకిల్ తొక్కు కుంటూ వచ్చేనా. కొంచెం తెరిపివ్వు,” ఇంకా మాట పూర్తిచెయ్యనే లేదు. విశ్వేసుడు కస్సుమన్నాడు.

"నీ చావు నాకెందుకు. నా పని నాకు ముఖ్యం. నా తద్దినం నాకు తీపి. ఇంతకీ ఏవన్నారు ఆ ఏబ్రాసులు," మహాకోపంగా కాళ్లుతొక్కుకుంటూ చేతులు పిసుక్కుంటూ కయ్యిమన్నాడు. మావ సంగతి నారాయణకి తెలియంది కాదు. ఆ ఆగ్రహజ్వాలల్ని గతంలో రుచి చూడకాకాదు. అందుకే,

"సరిపిల్లి చిట్టెయ్య, వారణాసి కోటేశ్వరరావూ భోక్తలుగా వస్తానన్నారు. తంగిరాల గున్నయ్యగారేమో మంత్రం చెప్తారట," పొడిపొడిగా జవాబిచ్చేడు.

"అఘోరించేరు కుంకాయిలు. ఎవరికోసం రారు. బాగానే తగలెడతాను కదా దక్షిణ. ఉచ్ఛిష్టపు భ్రష్టులు," రంకెలేసేడు విశ్వేశ్వరరావు.

ఆయన మాటకు నారాయణ అడ్డొస్తూ, "ముందే చెప్తున్నాను. చిట్టీ, కోటీశ్వర రావు కాస్త ఆలీసంగా రావొచ్చు. పేట నించీ సైకిళ్లమీద కదా దిగాలి," నిమ్మళంగా చెప్పేడు.

"సర్లే. ఎప్పుడో ఒహప్పుడు తగలడనీ. అపరాహ్నం దాటితేనే కదా ఆబ్దికం పెట్టేది. నువ్వు కూడా రేపు స్కూలూ గీలూ అనకుండా నా చేతికిందే ఏడూ. ఏదయినా పనీపాటూ ఉంటే చెప్పి ఛస్తాను," అరిచేడు విస్సుడు.

అన్నదానపువారివీధికి ఈయనగారి గొంతుక కొత్తకాదు. ఆ వీధి బ్రేమ్మలం దర్లోనూ గావుకేక బ్రహ్మ ఇతగాడేననీ పిల్లాజెల్లా అందరికీ తెలుసును. ఆ కేకలు విన్న నారాయణ, 'మావయ్య ఎప్పుడు మారుతాడో కదా,' అని ఎప్పటిలాగానే అనీసు కున్నాడు. వంటగదిలో ఉన్న కామాక్షమ్మ హృదయమూ ఆ క్షణంలో అచ్చం అలానే తలపోసింది.

* * *

ఊళ్లో పితృకార్యాలు పూర్వంలా ఖణీగా సాగడంలేదు. బ్రేమ్మడు పోతే అపర కర్మకి మనిషి దొరకడమే అగ్గజమవుతోంది. ఎందుకంటే ఆ పన్నెండు రోజులే వాడికి పెనువిలువ. తర్వాత ప్రతీనెలా జరిగే మాసికం రోజు, ఆనక సంవత్సరానికోసారి పెట్టే తద్దినవప్పుడే కించిత్ గౌరవం. మిగిలిన దినాలన్నీ వాడిని ఈకముక్కలా అవమాన కరంగా చూసే వాతావరణం ఏర్పడిపోయింది. మనిషి పోతే కర్మ జరిపించేవారూ సిసలైన బ్రేమ్మలే. వేదం చదివినవాళ్లే. స్మార్తం చెప్పుకున్నవాళ్లే. కాపోతే వాళ్ల వృత్తి ప్రేతతో పెనుసుకుపోతుంటుంది. కాబట్టే స్వపక్షంలోనే చిన్నచూపు. అశుభాల్లో వాళ్ల అవసరం పడినా ఆ కాస్తా తీరాక మొదటికి మోసం. వాళ్లు వీధిలోకొస్తే సాటి బ్రేమ్మలే ఎదురు తీసుకోరు. చీదరగా చూస్తారు. ఆఖరికి పిల్లనిచ్చేవాళ్లూ గబగబా దొరకరు. అదే గనుక పెళ్లీపేరంటం, బారసాల, ఉపనయనం వంటి శుభకార్యాలు నిర్వహించే పురోహితులయితే కొంతలో కొంత నయం. వీళ్లవి సివిల్ కర్మలకింద లెక్క గనక కొద్దిపాటి అర్ఘాసనం. ఇంకొద్దిపాటి పెద్దపీటాను. ఇందుచేతనే ఉత్తరక్రియలు

నిర్వహించే బ్రేమ్మలు క్రమక్రమంగా కరవైపోతున్నారు. ఎక్కడో పాతవారు ఈ పనిలో కొనసాగుతున్నా కొత్తవాళ్లెవ్వరూ పెద్దగా ఈ వంక కన్నెత్తి చూడ్డంలేదు.

రేపటివేళ విశ్వేసుడి తండ్రి హనుమంతరావుగారి తిథి. చోడవరం ఊరికే కాదు, ఇరుపంచాల గ్రామాలకీ హనుమయ్య తగుమనిషి. మనసున్న మనిషి. ఒకరికి సాయం చెయ్యడమేగానీ ఒకరిచేత చేయించుకున్న మనిషి కాదు. వ్యవహర్తా వ్యవసాయ దారున్నూ. ఆయనకి ఒక కొడుకు. ఒక కూతురు. కూతురు ఇంద్రాణికి జుత్తాడ సంబంధం చేసి ఎప్పుడో అత్తారింటికి తోలీసేరు. మిగిలింది కుమారరత్నం విశ్వేసుడే. వీడు సామాన్యమైన విస్సుడు కాడు. తండ్రి కడుపున తప్పబుట్టేడు. ప్రథమకోపం ముందు జనియించి ప్రథమ సంతానంగా వీడు ప్రభవించేడు. జనకుడు ఎంత మాట పొదుపరో వీడికంతటి నోటి వట్టం. డబ్బుందన్న పోతరం. ఎకరాలున్నాయన్న గోరో జనం. అందరి మీదా తిరగబడ్డం.

చిన్ననాటనే తల్లిపోవడంతో వీడి ఆగడాలన్నీ సహనంతో భరించేరు హనుమంత రావు. బోజుగా పెంచేరు. ఎఫ్.ఏ. చదివించేరు. లంకంత కొంపనీ, పెద్దమడుల పొలాల్నీ ఏలుకోమని చెప్పి కన్నుమూసేరు. కన్ను మూయడానికి కొద్దిరోజుల ముందే స్నేహితుడి కూతురు కామాక్షిని వీడికి కట్టబెట్టి దాన్నీ ఏలుకోమన్నారు. ఆ మాటకు తగ్గట్టుగానే విశ్వేశ్వరరావు రోజూ పెళ్లాన్ని ఏలుకుంటూ ఏడిపించుకు తింటున్నాడు. తన చెటకారీ మొగుడి సంగతి కామాక్షమ్మకి తెలీంది కాదు. మానాపతి ఇల్లాలు కావడాన యతీ అంటే ప్రతీ అనకుండా కాలం వెళ్లదీస్తోంది. ఎప్పటికీ పిల్లలు పుట్టని తమకు పెద్దయ్యాక ఇన్ని తులసి నీళ్లు పోస్తాడని భావించి, ఆడబడుచు ఇంద్రాణిని ఎలాగోలా ఒప్పించి, దాని పుట్టెడు పిల్లల్లోనూ కొసరువాడయిన నారాయణను ఇంటికి తెచ్చుకుంది. వాడు కూడా కన్నకొడుకులాగానే ఆ అమ్మ చేతికి అంది వచ్చేడు. విశ్వేశ్వరయ్యకి ఇదేం పట్టదు. చీటికీ మాటికీ ఆ గుంటడి మీద గగ్గోలెత్తిపోడమే.

* * *

ఇప్పుడున్న పరిస్థితుల్లో చోడవరానికీ చుట్టుపక్కల పల్లెలకీ పితృకార్యాలంటే పక్కనే ఉన్న ఫకీర్‌సాహెబ్‌పేట గ్రామమే పెద్దదిక్కు. పేటలో కొద్దిగా మిగిలిన భోక్తలే దేవుళ్లు. వీళ్లే ఎక్కడ మాసికమైనా తద్దినమైనా పరుగులు తీస్తుంటారు. పేదరికం పట్టి పీడిస్తుండటంతో ఎవరొచ్చి ఎప్పుడు పిలుస్తారా, ఎప్పుడు వెళ్లి పితృశేషాలు తిందామా, దక్షిణగా ఇచ్చే రూపాయిబిళ్లలు తెచ్చుకుందామా అని ఆశగా ఎదురు చూస్తుంటారు. ఏ కబురు అందినా వీళ్లకి ఫరవాలేదు. విస్సుడి ఇంటి నుంచి పిలు పొస్తేనే యమగండం. డబ్బులివ్వడని కాదు. తిథి మొదలైనప్పటినుంచీ వాడి గోలే తప్పనిచ్చి మంత్రస్వరం వినపడనివ్వడు. పెళవరించి నీళ్లు ధారపోయమన్నా తప్పే. మామూలుగా ఎందుకు పొయ్యకూడదట? అంటూ క్రియ చేయించే మంత్ర బ్రేమ్మడి

మీద మండిపడతాడు. జంధ్యం సవ్యం చేసుకోమంటే కుదరదంటాడు. అపసవ్యంగానే ఉంచుకుంటానంటాడు. అది తప్పు అని చెబితే తన్నడానికొస్తాడు.

ఏదిఏమైనా ఈ సంవత్సరం వాడింటికి భోక్తగా వెళ్లవలసిన పేట పంతుళ్లు చిట్టెయ్య, కోటేశ్వరరావులకు భయం పట్టీసుకుంది. రేపటి హనుమంతరావు తద్దినం దిగ్విజయంగా ఎలా చేయించగలమోననే శంక వారిని అప్పుడే పీడించీడం మొదలెట్టీ సింది.

"ఒరేయ్ కోటీ! మళ్లీ విషమ సమస్యేనురా. గున్నయ్యపంతులికి ఫరవాలేదు. మంత్రం చెప్పీసి ముంగిలా కూచుండిపోతాడు. తిండి తినీ మనకే తీరిపోతుంది. రెండు గారెలు ఎక్కువ తింటే తప్పు. రెండు నూలుండలు తక్కువ తింటే దొబ్బు. విస్సుడితో పడలేం," తోటి భోక్త కోటీశ్వరరావుతో అనీసేడు పేట రామకోవెల్లో కూచుని జంధ్యాలు వడుక్కుంటున్న చిట్టెయ్య.

"ఏం చేస్తాంలేరా. ఎన్ని బాధలొచ్చినా వృత్తిధర్మం అనీసుకోడమే. పితృయజ్ఞాలు చేయించకపోతే మన దినం తీరదు. ఎవరి దాష్టీకమైన భరించవలసిందేను. కాపోతే ఈ సంవత్సరం మరో చిక్కొచ్చి పడిపోయింది," అన్నాడు భయంభయంగా చిట్టెయ్య వేపు తిరిగి కోటి.

"అదేంటట," సజావుగా బతుకు సాగుతున్నా కూడా ఎప్పుడయినా ఏదయినా ప్రమాదం జరిగిపోవచ్చన్న ముందస్తు శంకతో నిత్యమూ బెగిలిపోయే అమాయకపు చిట్టెయ్య మరింత అమాయకంగా ముఖంపెట్టి అడిగేడు.

"ఏంటా. మర్చిపోయేవేంటి. విస్సుడింట తద్దినం ఒప్పీసుకున్నాం సరే. ఆ తిథికే పడిపోయింది మన పేట మునసబుగారి తల్లి ఆబ్దికం రెండూ ఎలా కానిస్తాం," కోటీశ్వరరావు నింపాదిగా పలికేడు. అది వినీసరికి పక్కలోనే పర్వతం పడిపోయినట్ట య్యేడు చిట్టెయ్య. గాఢనిద్రలో ఉన్నవాణ్ని హఠాత్తుగా లేపి గూబపేలగొట్టేస్తే ఏమీ అర్థంకానివాడిలా మొహం కొంచేపు వాడు ఎలా పెడతాడో అచ్చం అలాగే పెట్టీసేడు.

"చంపీసేవురా నాయినా. ఇప్పుడు చెప్పేవేంట్రా ముష్టిచచ్చినవెధవా. ఇందా కళ్లా చెబితే హనుమయ్య తిథి ఒప్పుకునీవాళ్లమే కాదు కదరా," అంటూ దీనవదను డయ్యేడు.

"ఆ నారాయణ గుంటడు అటు చోడవరం దారిపట్టేక గుర్తుకొచ్చిందీ విషయం. ఏం చెయ్యమంటావ్. అయినా నీకూ మతిమరుపేలేరా చిట్టీ. నిన్న సాయంత్రంవేళ మునసబుగారి కార్యం నువ్వే గుర్తు చేస్తివి. ఈ వేళ మరిచిపోతివి. మతిహీనాయీ," కోటేశు కొంచెం తిట్టినట్టే మాట్లాడేడు.

"ఓరి కోటేశా! ఆపదతీరీ ఉపాయం చెప్పమీ. మునసబు ఇంటికెళ్లకపోతే నిత్యం పేటలో ఉండీవాళ్లం. పులుసులోకి ఎముకలుండవు. అలా అని విస్సుడింటికి

పోకపోతే వాడు మన పంచెలు విప్పించి లోపలి సామాన్లనీ చక్కబెడతాడాయే. చచ్చీచా వొచ్చింది నాయినా,'' ఘోరమైన భీతావహమేదో చుట్టుకోగా బతిమాలడం మొదలెట్టేడు చిట్టి.

ఏదో ఆలోచించుకున్నవాడిలా కోటేశుడు చిన్నగా సంజ్ఞలు మొదలెట్టేడు. తన దిక్కు జరిగి చెవి ఇమ్మనమన్నట్టుగా చిట్టిగాడికి సైగలు చేసేడు. వాడు కోరినట్టుగానే చిట్టెయ్య చెవి ఒగ్గేడు. గళం తగ్గించి కోటేశు అన్నాడు కదా-

''ఒరేయ్! సరీగా విను. ఇదంతా మూడోకంటికి తెలీకూడదు. మనవేం రాష్ట్రపతి కాదు. ప్రధానమంత్రి అంతకన్నా కాదు. మనం దినామూ ఎక్కడికెళుతున్నామో అందరికీ తెలీడానికి. నోరూ ఇంకోటి మూసుకుని ముందుగా మునసబింటికెళిపోదాం. వాడు కాళ్లు కడిగే కదా తద్దినం తగలెడతాడు. ఒంటిగంటకల్లా కొద్దిగా అంటే కొద్దిగానే వాడింట కతుకుదాం. కడుపులో ఖాళీ ఉంచుకుందాం. చల్లగా దక్షిణ పుచ్చీసుకుని చోడారం పోదాం. విస్సుడింట మిగిలిన భోజనం కానిచ్చేద్దాం. రెండో దక్షిణా దక్కుతుంది. ఎవరి దగ్గరా మాటపోదు. ఏవంటావ్,'' ఆ మాటకి చిట్టికి చెమట్లెక్కీసేయి.

''పిచ్చిగా మాట్లాడకురా కోటయ్యా. పితృకార్యాలు అగలాసగలాగా పెట్టిస్తే పైనున్న దేవతలు ముడ్డిమీద తంతారు,'' అన్నాడు ఉగ్రంగా.

''అవును మరి. పైనున్న దేవతలకి ఇదే పని. మనం ఎప్పుడు తప్పు చేస్తామా. తన్నడానికి మన ముడ్లు ఎప్పుడు ఖాళీగా దొరుకుతాయా అని వాళ్లంతా ఎదురు చూస్తుంటారు. బుద్ధిలేపోతే సరి. చెప్పినట్టు చెయ్యరా పిచ్చికక్కగట్టా. అలా చేస్తే ఎక్కడా మాటుండదు. డబల్‌గా డబ్బులొస్తాయి. కాదంటే మటుకు ఒకరింట బడితె పూజ ఖాయం,'' కోటేశు వీరావేశంతో అనేసిన ఈ మాటలేవీ చిట్టెయ్యను పెద్దగా కదిలించలేదు. వాడు కొసన ఉపయోగించిన బడితెపూజ అనే ముక్క మాత్రం కార్యోన్ముఖుణ్ని చేసీసింది.

''ఎలాగో అఘోరిద్దాంలే. అయితే మటుకు ఫాలాక్షుడికయినా తెలియనివ్వకూడదు సుమీ. మన కోవటి దుకాణం బాకీలైనా చెల్లిపోతాయి. నువ్వు చెప్పినట్టే చేదాం,'' అనేసి జంర్ఝుప్పోగులు తీసుకుని ఇంటికిపోయేడు.

* * *

మరసటిరోజు యథావిధిగా సంధ్యలు గట్రా వార్చేరు చిట్టిబాబు కోటిబాబూను. కాఫీలు తాగేరు. కొంచెం ఎండెక్కేక చీపురుపుల్లల్తో అరటిదొన్నెలు కుట్టుకున్నారు. దర్భలు పట్టుకున్నారు. రెండేసి పంచెల్ని, రెండేసి తువ్వాళ్లని సిద్ధపరుచుకున్నారు. చేసంచుల్లో పెట్టుకున్నారు. కట్టిన గావంచాలు ఎగ్గట్టేరు. సైకిళ్లెక్కేరు. అప్పటికి పన్నెండు దగ్గరయింది. మెల్లగా పేట మురికిరోడ్లను దాటుకుంటూ మునసబు దిట్టకవి బంగారయ్య ఇంటికి వెళ్లేరు.

బంగారయ్య వీళ్ల కోసమే ఎదురుచూస్తున్నారు. తల్లి తిథి శ్రద్ధగా జరపడం అతనికి ఇష్టమే. తంతు అంటేనే తగడాబిగడా. అస్సలు గిట్టదు. సమంత్రకంగా పెట్టడం ఎప్పుడో మరిచిపోయేరు. జోడు బ్రహ్మలను పిలిచి కాళ్లు కడిగి ఏటా అయిందని పించీడమే. వాళ్లకి అన్నాలు పెట్టి దక్షిణ ఇచ్చి పంపించీడవే. వాళ్లూ అటు వెళ్లగానే తన ఉదరపూజ పూర్తి చేసుకుని జమాబందీలకు పోడమే.

దేవుళ్లలా సమయానికే వచ్చిన భోక్తలను చూసి మునసబు దండాలు పెట్టేరు. వారికి పెరటివేపు దారి చూపించేరు. వెళ్లీవెళ్లగానే పెరట్లోని ఇత్తడి గాబుల్లో ఉన్న మడినీళ్లను పడపడా పంతుళ్లిద్దరూ  దిమ్మరించుకున్నారు. తలమీంచి స్నానాలు కానిచ్చేరు. తద్దినం కదా. సబ్బుల్తో సావాసాలు, గంటల తరబడి చంకలు తోంకోడాలు ఉండవు. తడి గావంచాలని తాడుమీద పారేసి, తెచ్చుకున్న మడిబట్టలు సంచీలోంచి తీసి కట్టీసేరు. సావిట్లో దర్భలు చిక్కుతూ మఠాలేసుక్కూచున్నారు.

మునసబుగారి భార్య విశాలాక్షి అప్పటికే అన్నీ చేసిపెట్టీసింది. అప్పాలు, గారెలు, నువ్వులుండలు, పరవాన్నం సిద్ధమయ్యేయి. బలుసు, చిక్కుడు, తోటకూర, బెండకాయ కూరలు ఘుమఘుమలాడుతున్నాయి. ఉడికాక ఎనిపిన పెసరపప్పు పొగలు కక్కుతోంది. కాచిన ఆవు నెయ్యి వాసన కమ్మగా తగులుతోంది.

వీటన్నింటినీ తెచ్చి సావిట్లో ఉత్తరం వేపుకి చేర్చింది విశాలాక్షి. ఆయమ్మ తద్దినాల స్పెషలిస్టు. ఆవిడ మెట్టినింట కాలుమోపిన వెంటనే మునసబుగారి తండ్రి ఫట్. ఆ తర్వాత కొద్దికాలానికే తల్లి ఫటాఫట్. భర్తగారి దిక్కుమాలిన మేనత్తా మరికొంత కాలానికే కిక్స్ ద బకెట్. దీంతో ఈ మహాతల్లి తద్దినాల మారాణీ అయిపోయింది. ఎన్ని పచ్చళ్లు ఎన్ని కూరలు ఎన్ని పిండివంటలయినా క్షణంలో చేసీగల్దు. వడ్డన సైతం విస్తట్లో ఏ దిక్కునుంచి ఏ దిక్కుకి చెయ్యాలో కూలంకషంగా తెలుసునంటే ఈ విశాలాక్షి ఎంతటి శ్రాద్ధాల సువిశాలాక్షో చెప్పీవొచ్చు.

వంటలన్నీ దగ్గరగా చేరేక కోటేశు ఆకలి రెట్టింపయిపోయింది. ఉదయం ఇంటి దగ్గర పెళ్లాంగారు ఈడసాళ్లబడుతూ ఇచ్చిన ముష్టి కాఫీ తప్పనిచ్చి గొంతులోకి చేరిందేమీ లేదు. అలాంటి ఆకలివేళ ఇలాంటి తిండి కనబడితే ఎవడికయినా ముఖం వికసించదా. కోటేశుకీ వికసించింది. ఆ వికసనం చిట్టెయ్య కంటపడింది. చిరచిరలాడి పోయేడు. 'మరో పని కూడా ఒప్పుకుని చచ్చేం కదరా...' అన్నట్టుగా కొరకొరా అతని ముఖంలోకి చూసేడు. 'ఎక్కువగా తింటే మక్కెలిరగ్గొట్టీగలను జాగ్రత్త...' అన్నట్టు గానూ చూసేడు. దెబ్బకి కోటేశు స్టడీలోకొచ్చీసేడు. ఇద్దరినీ నిలబెట్టి కాళ్లు కడిగిన మునసబుగారు వడ్డనకి ఇషారా ఇచ్చేరు. దర్భలు బుర్ర మీద వేయించుకుని, చేతివేళ్లకి పవిత్రాలు చుట్టుకుని, అరిటాకు సాపు చేసుకుని, నీళ్లు జల్లి, భోజనానికి సిద్ధపడ్డారు భోక్తలు. అలవాటున్న మనిషి గనుక విశాలాక్షి చకచకా వడ్డించీసింది.

"హాయిగా తినండి. రాత్రికి క్షుద్బాధ లేకుండా అన్నీ పుచ్చుకోండి," సంకల్పం చెప్పి మజ్జిగ చుక్కలు విస్తళ్లలో వదిలి మునసబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చీసేరు. కోటేశు తిండం మొదలెట్టేడు. చిట్టెయ్య మాత్రం మెల్లగా కతుకుతున్నాడు. వాడు తిండం కంటే కోటశువేపు చూడ్డవే ఎక్కువైపోయింది. దానాదీనా కోటేశూ పెద్దగా లాగించడం పెట్టుకోలేదు.

"అయ్యా బ్రేమ్మలూ మొహమాట పడకండి. మీరే ఈరోజు మా అత్తగారి రూపంలో ఉన్న దేవతలు," ముందరి కాళ్లమీద ముద్దుగా లేచి నిష్పూచీగా సకిలించిన అడవిగుర్రంలా పలికింది విశాలాక్షి. తద్దినం వంటకోసం పడిన కష్టం కంటే అత్తగారు పోయారన్న సుఖమే ఆ అమ్మగారిలో ఎక్కువగా ఉన్నట్టు ఆ సకిలింపు సవివరంగా స్పష్టం చేసింది.

"నువ్వెంత ప్రార్థించినా వాళ్లు తినగలిసిందే తినగలరు. పూర్వం బ్రేమ్మలు కాదు ఇప్పటివారు. అప్పట్లో తిళ్లు వేరు. ఆ పొట్టలు వేరు," వీలయినంత వేగంగా భోక్తలు తినిపోతే మంచిదన్నట్టుగా బంగారయ్యగారన్నారు.

'మునసబూ! మాకు మరో బేరం లేపోతే ఈరోజు నీ సంగతి తేల్చీవాళ్లం కాదు టయ్యా. మీ ఆవిడ వడ్డింపు చెయ్యలేక నడ్డివిరిగి చచ్చీదికాదూ...' అన్నట్టుగా ఆయన వైపు అదోలా చూస్తూ కోటేశు ఇకిలించేడు. మొత్తానికి ఆ విధంగా విస్తట్లో పడ్డ అన్నింటినీ కొంత కొంతగా నమిలి నమిలి, కొరికి కొరికి, మింగి మింగి, ఉత్తరాపోశం పట్టీసేరు భోక్తలు. మంత్రాలు కొన్నింటిని కాసేపు కాకరబీకరగా చదివి అయిందని పించేరు. పెరట్లో కాళ్లు కడుక్కుని తువ్వాళ్లతో మూతులు తుడుచుని వచ్చిన వీళ్లకి తాంబూలాలిచ్చేరు మునసబు దంపతులు. కాళ్లకి దండం పెట్టీసి వాళ్ల చేత కడుగుడు బియ్యం అక్షింతలుగా వేయించుకుని మురిసిపోయేరు.

అప్పటికి మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. మునసబుగారింట అరకొర ఆరగింపు చేసి సైకిళ్లెక్కిన పేట పంతులయ్యలు మెల్లగా ఊరి పొలిమేర దాటేరు. తిన్నది ఎంతయినా కావచ్చు. తిన్న వెంటనే సైకిళ్లు తీసేరు. కొంచెం పక్కలో నొప్పి పెడుతోంది. నిమానుగా తొక్కుతున్నారు.

"ఒరేయ్ కోటిగా మెల్లిగా పోనీరా. నీరసంగా ఉంది," అన్నాడు చిట్టి.

"నాకు మాత్రం లేదేంటి. టైముకి వెళ్లకపోతే విశ్వేసంబాబు వీపు బద్దలు గొడతాడు. పద పద," అంటూ ఫర్రుమని సైకిల్ని ఉరికించేడు కోటేశు. విస్సుడి పేరు వినగానే పక్కలో శూల గాలికెగిరిపోగా సైకిల్ పెడళ్లమీద కాళ్ల బలం చూపించేడు చిట్టెయ్య. మరో ముప్పావుగంటసేపు పాట్లుపడ్డాక చోడవరం ఊళ్లోకి వచ్చి పడ్డారిద్దరూను. అన్నదానపువారివీధి చేరుకోడమే మిగిలి ఉంది. ఇద్దరికీ ఒళ్లంతా చెమట్లే. సరిగ్గా ఇదే సమయానికి అక్కడ ఇంటి వసారాలో విశ్వేశ్వరరావు చిందులు తొక్కుతున్నాడు.

‘‘రెండు గంటలు దాటిపోయింది. ఈ వెధలు ఎక్కడ చచ్చారో ఏమో. వెధవలాని వెధవలు. అపరకర్మల వెధవలు,’’ ఘోరంగా తిడుతున్నాడు.

‘‘పోనీండీ. భోక్తల్ని కోంపడితే మనకే పాపం. వచ్చెస్తార్లెండి. ఈ పాటికి ఊళ్లో దిగే ఉంటారు,’’ సర్దిచెప్పబోయేడు మంత్ర బ్రేమ్మడయిన గున్నయ్య.

‘‘ఇలా ఉంటుంది బాబూ! మీ బుగతగారి దూకుడు. రోజూ ఇంట్లో పడలేక ఛస్తున్నాను,’’ అంది అప్పటికే వంటలు సిద్ధం చేసిన కామాక్షమ్మ.

‘‘నువ్వు నోరుమూస్తావా. ముష్టి మాట్లాడకు,’’ ఒంటికాలిమీద లేచాడు విశ్వేసుడు.

‘‘ఊరుకో అత్తా. ఎందుకిప్పుడు అదంతాను.’’ విసుగు కలిసిన స్వరంతో అక్కడికి కాస్త దూరంలో కూచుని, కమాండర్ ఏ పని చెబితే ఆ పనిచేయడానికి సిద్ధంగా ఉన్న దేశభక్త జవాన్లా మాట్లాడేడు నారాయణ.

ఈ సంభాషణంతా ఇలా జరుగుతుండగానే వాకిట్లోకి దిగేరు కోటేశు, చిట్టెయ్య. అందరూ ‘హమ్మయ్యా...’ అనుకున్నారు.

వాస్తవానికి అంతసేపు శరీరాన్ని అలవబెట్టి పేటనుంచి వచ్చినందుకు ఇద్దరు బ్రేమ్మలూ ఎవరేం పెట్టినా తినేద్దామన్నట్టుగా ఉండాలి. ఎవరు ఏవిచ్చినా తాగేద్దా మన్నట్టుగానూ ఉండాలి. కానీ, మునసబుగారింట వాళ్ల తిండి ఆకుకి అందక పోకకి పొందక పక్కల్లో పోట్లు పెట్టి కుదగొట్టేస్తోంది. ఒగర్చుకుంటూ నెమ్మదిగా ఇద్దరూ వసారా ముందు భాగాన సైకిళ్లని స్టాండ్లేసి నిలవదీసేరు. అప్పుడిక విశ్వేసుడూ స్నానం చేసి సిద్ధమైపోయేడు.

‘‘సమయం దాటి తగలడుతోంది. త్వరగా కానివ్వండి,’’ భోక్తల్ని తొందర పెట్టేడు.

గున్నయ్య మంత్రాలు అందుకున్నాడు. మడి కట్టుకుని ఉన్న కామాక్షమ్మ అగ్నిహోత్రాన్ని వ్రేల్చింది. స్వాహామంత్రాలు చదివేడు గున్నయ్య. కోటేశు, చిట్టెయ్య స్నానాలు చేసి వచ్చేరు. వాళ్లచేత తంతు నడిపించి కూచోబెట్టారు గున్నయ్య. వడ్డన మొదలైంది. వంటకాలు విస్తట్లో వచ్చిపడుతున్నాయి. కానీ కోటేశు చిట్టెయ్యలకు తిండి మీదికి మనసు వెళ్లడంలేదు. పేటలో తిన్నది ఇంకా కడుపులోనే ఉన్నట్టుంది. తప్పదన్నట్టుగా పరిష్యం పట్టి మొదలెట్టేరు. నోటికేవన్నా వెళితేనా. కోటేశు వంక చిట్టెయ్య, చిట్టెయ్య వంక కోటేశు చూసుకుంటున్నారు. ఇంతలోనే కామాక్షమ్మ పప్పు తీసుకొచ్చి అన్నం మీద ఒంపింది. కలిపాడేగానీ తినలేకపోతున్నాడు కోటేశు. పెసరన్నం అతికష్టం మీద అయిందనిపించాక మరి వేటి పైకీ ఇద్దరూ పోలేకపోయేరు. వీళ్ల లాగుడు వ్యవహారం విశ్వేశ్వరరావులో విపరీతమైన అసహనం కలిగించింది.

‘‘అదేంటి ఆ తినడం. సుబ్బరంగా తినండి. భోక్తలెంత బాగా తింటే పితృ దేవతలకంతటి తృప్తి. కానీండి. కానీండి,’’ నోరుచేసుకున్నాడు విస్సుడు. భోక్తలు మరో

అప్పం తిన్నారు. ఇంకో తిలపిష్టం మింగేరు. కాస్తంత పరవాన్నమూ నోటపెట్టేరు. అంతకుమించి తినలేమన్నారు. పురిషిట్లో మజ్జిగ పోసీమని కామాక్షి ముందు చెయ్యి జాచేరు. ఆమె ఆశ్చర్యపోయింది. నారాయణ కూడా భోక్తల పథ్యం తిండికి విస్మయం పాలయ్యేడు. గున్నయ్య సంగతి సరేసరి.

"ఈ వేళ ఏవొచ్చిందిరా మీకు. ఎప్పుడూ బాగానే తినీవారు కదా. ఇంత నాసిగా తింటే వంటలెలా ఖర్చవుతాయీ," దీర్ఘాలు తీసేడు అయోమయంగా గున్నయ్య.

'బాబూ! మేం మరో తద్దినానికి వెళ్లొచ్చేం. ఇది రెండో తిండి,' అని చెప్పలేరు కదా ఈ భోక్తలు. అలా చెబితే వీపు వాచిపోతుంది. కొంపలంటుకుపోతాయి. అందుకే అమాయకంగా ఆయన వంక చూసి వెర్రినవ్వు నవ్వీసేరు. ఆ నవ్వుకు విశ్వేశ్వరరావు కాకెత్తిపోయేడు. రేగిపోయేడు. పూర్తిగా అదుపు తప్పిపోయేడు.

"ఏరా... నా ఇంటికి వచ్చినప్పుడే మీరు టీబీ పేషంట్లలా తింటార్రా. మా నాన్న తిథినాడే మీరు రిలే నిరాహారదీక్ష చేపడతార్రా. మీరింత తక్కువగా తింటే నా తండ్రి ఆకాశంలో సంవత్సరం పాటు ఏ గడ్డికరిచి బతకాల్రా గాడిదకొడకల్లారా," నేత్రాలు ఎర్రగా చేసీసుకుని నిప్పులు చెరిగీసేడు. వాళ్ల మీద కలియబడిపోయేడు.

ఆ సమయంలో గున్నయ్య విస్సుణ్ని అడ్డుకోలేక అడ్డుకోలేక అడ్డుకున్నాడు. పుణ్యతిథి రసాభాస అయిపోతుందని, వాళ్లు అలిగి వెళ్లిపోతే మరోసారి అన్నీ చేసుకోవాలని బతిమాలేడు. నారాయణ కూడా మావయ్యని ప్రాధేయపడ్డాడు. కామాక్షమ్మ కళ్లనీళ్లు కుమ్ముకుంటూ మొగుడివేపు చూసింది. దీంతో అతగాడు అప్పటికేదో తశ్శాంతి పొందినట్టయి గున్నయ్యను తొందరపెట్టేడు. మిగతా వ్యవహారం పూర్తి చేయించీసేడు. పిండం కాకికి పెట్టీసేడు. తప్పు చేసినవాళ్లలా చిట్టీకోటేశులు నూతి దగ్గరకు పోయి చేతులూ కాళ్లూ కడుక్కుని వసారాలోకొచ్చి నిలబడ్డారు. మటమట లాడుతూనే వాళ్లకి దక్షిణలిచ్చేడు విశ్వేశ్వరరావు. ఇంక బయటికి దయచేయండన్నట్టుగా వారివేపు చూసేడు. ఆ ముద్దీన సైకిళ్లెక్కి వీళ్లు పేట దిక్కున పోతే బాగుండిపోను. అలా కాలేదు. ఆ సమయంలోనే జడ్డి మాటొకటి ఆడీసేడు కోటేశు.

"ఏంటండీ గాడిదలూ గీడిదలూ అని మాట్లాడేరు. తోటి బ్రేమ్మలం మాకు ఆ మాత్రం గౌరవం ఇవ్వప్పోతే ఎలాగండీ," సూరుమానంగా అనీసేడు.

అసలే విస్సుడు కోతిలాగున్నాడు. కోటేశు మాటకి నిప్పు తొక్కినట్టయిపోయేడు.

"ఏంట్రా తద్దినం నాకొడకా. ఏం మాట్లాడుతున్నావ్. పుణ్యానికి నా ఇంటికొచ్చి తిన్నారేంట్రా పుండాకోరుల్లారా. డబ్బుదొబ్బి కార్యం కరక్టుగా చెయ్యకపోతే ఎలారా బిలిబిత్తిలి వెధవల్లాలా. ఈ జరుగుబిల్లి విస్సుడు మీ కంటికి విస్సాకారంగా కనిపిస్తున్నాడేం." విసవిసలాడిపోయేడు.

ఆ కోపంలోనే వసారా పెణకలోంచి బాణాకర్ర బయటకి లాగీసేడు. దాన్ని చూడగానే కోటేశుకీ పౌరుషం పెరిగింది. చిట్టికి మాత్రం కారింది మూత్రం.

''ఏం కొడతారా,'' అని ఎదురాడాడు కోటేశు.

కోపంతో ఊగిపోతున్న విశ్వేసుడు ఆ మాట ఆలకించేసరికి మరి ఆగలేక పోయేడు.

''కొడ్డం కొని తేవాలేంట్రా చెవలాయీ,'' అంటూ కఱ్ఱతో ఒక్కసారిగా కోటేశు డొక్కలోనూ చిట్టెయ్య డొక్కలోనూ కుఱ్ఱుపోట్లు ఎడాపెడా పొడిచీసేడు. అసలే బలమైన బాణాకఱ్ఱ. ఆ పైన కుఱ్ఱుపోట్లు. భోక్తలిద్దరూ ఎంతయినా రెండు తద్దినాల తిళ్లు తిన్నవాళ్లు. అంతే. దెబ్బకి వసారాలోంచి ఒక్క ఉదుటన వాకిట్లోకొచ్చి పడిపోయారు. ఆ మీదట వాళ్లిద్దరికీ అచ్చం ఒకేలాగ వాంతయింది. ఒకే వైశాల్యంతో వాంతయింది. వాకిలంతా ఖరాబయింది. మునసబుగారింటి గారెలు, జరుగుబిల్లి వారింటి క్షీరాన్నం మొగుమొత్తంగా కిలం కొట్టీసింది. వమనం భారీగా కావడంతో ప్రాణాలు పోయినట్టయిపోయిన బ్రేమ్మలిద్దరూ వాకిట్లోనే వెల్లకిలా పడిపోయేరు. అలా కదలకుండా కొన్నిక్షణాలు ఉండిపోయేరు. గున్నయ్యకి ఏమీ పాలుపోలేదు.

''అయ్యా, వాళ్లను చంపేస్తారా ఏంటి. ఖూనీ కేసు అయిపోతుంది. నన్ను ప్రధానసాక్ష్యంగా వేసి మిమ్మల్ని నెంబర్‌వన్ ముద్దాయి చేస్తారు సుమా,'' ఇలా పలుకుతూనే విశ్వేసుడి చేతిలో కఱ్ఱలాక్కోగలిగేడు.

ఈలోగా ఇరుగుపొరుగుంతా దౌడాయింపుతో అక్కడికి చేరీసేరు. కోటేశు ముఖం కడిగించేరు. చిట్టెయ్యకయితే స్నానమే చేయించవలసి వచ్చింది. నారాయణ, కామాక్షమ్మ కలిసి విశ్వేసుడి రెక్కలు కలియగట్టి ఇంట్లోపలికి తెచ్చి పారీసేరు. వాకిలి కడుక్కున్నారు. కొంతసేపయ్యేక తేటపడ్డ భోక్తలకి సైకిళ్లిచ్చి పొమ్మనమన్నారు గున్నయ్య. విస్సుడి సంగతి తెలిసున్నదే కాబట్టి చుట్టుపక్కవాళ్లూ తమ తమ నెలవుకు పోనేపోయేరు. క్షణాల్లోనే అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలింది.

జరిగిన దానికి చింతపడుతూ మిగిలిపోయిన వంటలన్నింటినీ వంటింట్లో తిన్నెమీద పేరుస్తోంది కామాక్షి. అత్తయ్యకి పనిలో సాయం చేస్తున్నాడు నారాయణ. వంటగది ఆగ్నేయంలో ఉంది. అది వీధిలోకి పొడుచుకుని వచ్చినట్టుంటుంది. అందుకే సైకిళ్లను నడిపించుకుంటూ పడుతూ లేస్తూ భారంగా వెళుతున్న భోక్తల మాటలు వినపడుతున్నాయి.

''ఇదెంత ఘోరమో చూడ్రా. మన బ్రేమ్మలే మనల్ని కొట్టీడం ఏంట్రా. తప్పిజారి తగలకూడని చోట తగిల్తే చచ్చిపోదుం కదరా,'' ఎగసిపడుతున్న కన్నీటిని తుడుచు కుంటూ అన్నాడు కోటేశు.

'రెండు తిథులూ సాటివారివే కదా అక్కర తీరుద్దామని అనీసుకున్నాను. మనుషులు కుదరక ఏ ఇంటివారూ బాధపడకూడదని అనుకున్నాను. ఋణబాధ ఎక్కువగా ఉంది గనక కొన్ని బాకీలయినా రెండు దక్షిణలతోనూ తీరుద్దామనీ ఆశ

పడ్డాను. జరుగుబిల్లివారింట ఇంత సత్కారం జరుగుతుందని ఊహించలేదురా. గట్టిగా పొడిచీసేడ్రా డొక్కలోను,'' కోటేశు కంటే హెచ్చుగా బాధపడుతూ గగ్గోలుగా అన్నాడు చిట్టెయ్య.

వంటింట్లోంచి ఆ మాటలు ఆలకించిన కామాక్షమ్మ కదిలిపోయింది. చలించి పోయింది. ఆర్ద్రమైపోయింది. ఆమె కళ్లు ధారాపాతంగా వర్షించడం మొదలెట్టేయి. మెల్లగా నేత్రాలొత్తుకుంటూనే నారాయణవైపు తిరిగి,

''ఏం మనిషిరా మీ మావయ్య. భోక్తలు వాంతి చేసుకుంటే తద్దినం పెట్టి నట్టుట్రా. అయినా ఆ కోపాలేంట్రా. ఆ కొట్టుకోడాలేంట్రా. పాపాన పడిపోడానికిగానీ,'' వాపోయింది. వెనువెంటనే ఏమనుకుందో ఏమో, గబగబా సందుకా పెట్టి తీసింది. అందులోంచి కరకరలాడే కొత్త రూపాయి నోట్ల దొంతి చప్పున బయటకి లాగింది. అవి ఎన్నున్నాయో తెలీదు. ఆవిడ లెక్కబెట్టాలేదు.

''పాపం. డబ్బు అవసరం ఉన్నట్టుంది భోక్తలకి. ఇవి ఇచ్చీసి వాళ్ల కాళ్లకి దండం పెట్టీసిరా. మావయ్య చేసిన పాపం కొంతలో కొంతయినా తగ్గుతుంది,'' కన్నీరు పెల్లుబుకుతుండగా రూపాయి నోట్లు నారాయణ చేతికిచ్చింది.

అత్తయ్య ఇచ్చిన డబ్బు అందుకున్నాడా పిల్లాడు. ఆ క్షణంలో ఆ అబ్బాయికి అనిపించింది. అత్తయ్య పాదాలకి నుదురు తాకించి నమస్కరించాలని...! ఇంతా చేసీసి ఏమీ ఎరగనట్టుగా మూలగదిలో నారాయణతీర్థుల తరంగాలు పాడుకుంటున్న మావయ్యను పట్టుకుని అతగాడి డొక్కలో బాణాకర్రతో కసాబిసా కుర్రుపోట్లు పొడిచీ యాలని...!!

*విశాలాంధ్ర ఆదివారం*
*27 అక్టోబర్ 2019*

❋




18 జూన్ 1964న విశాఖపట్నం జిల్లాలో పుట్టిన **చింతకింది శ్రీనివాస రావు** మొదటి కథ *నిదర్శనం* 12 జులై 2010 ది సండే ఇండియన్‌లో అచ్చయ్యింది. 60కి పైగా కథలు రాశారు. మూడు కథాసంపుటాలు- *దాలప్పతీర్థం, కాన్పులదిబ్బ, కప్పస్తంభం*; మూడు నవలలు, ఒక కథన సంపుటి, ఒక నానీల కవితాసంపుటి ప్రచురించారు. జర్నలిజం వృత్తిలో ఉన్నారు.

**చిరునామా:** **6-60/1, రవీంద్ర నగర్, పాత డైరీఫారం,**
**విశాఖపట్నం-530 040**
***ఫోన్: 98971 47067*** ***chsr005@gmail.com***